

ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మురుగునీటి సమస్య పరిష్కారానికి కృషి

● ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

వనస్థలిపురం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కాలనీవాసులు ఎదుర్కొంటున్న మురుగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్ సౌత్ కాలనీలో మంగళవారం పలు శాఖల అధికారులతో కలిసి ఆయన పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. మురుగునీటితో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, ఫారెస్ట్ అధికారి కస్నా నాయక్, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.

గ్రీన్‌పార్కు కాలనీలో వర్షపు నీరు నిల్వకుండా చర్యలు

● జడ్‌సీ హేమంత కేశవ్ పాటిల్

ఎల్‌బీనగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గ్రీన్‌పార్కు కాలనీలో వర్షపునీరు నిల్వకుండా చర్యలు తీసుకుంటామని జీహెచ్‌ఎంసీ ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ తెలిపారు. వర్షం వచ్చినప్పుడు కాలనీలో రోడ్లపై మురుగునీరు పారుతోందని జోనల్ కార్యాలయం ఎదుట స్థానికులు ఇటీవల ఆందోళన చేసిన విషయం విదితమే. మంగళవారం జోనల్ కమిషనర్, కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి, ఇరిగేషన్, జీహెచ్‌ఎంసీ అధికారులు కాలనీలో పర్యటించి సమస్యను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో హేమంత్ కేశవ్‌పాటిల్ మాట్లాడుతూ 30 ఫీట్ల రోడ్డులో నీటి ప్రవాహానికి ఆటంకంగా ఉన్న ర్యాంపులను తొలగించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఎల్‌బీనగర్ ఈఈ కార్తీక్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ప్రతాప్, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు బాల్‌రెడ్డి, చంద్రగుప్త, వెంకట్‌రెడ్డి, రామయ్య, అంజయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



తుర్కయంజాల్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

సీపీఎం నాయకులను విడుదల చేయాలి

హయత్‌నగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అరెస్టును ఖండిస్తూ మంగళవారం తుర్కయంజాల్ చౌరస్తా వద్ద అంబేడ్కర్ విగ్రహం ఎదుట సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. జిల్లా కమిటీ సభ్యుడు డి. కిషన్ మాట్లాడుతూ అనాజ్‌పూర్‌లో సీలింగ్ భూములు పొందిన రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని నిరసన వ్యక్తం చేస్తున్న జాన్ వెస్లీ, నాయకులను అరెస్ట్ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతమందికి పాసుపుస్తకాలు ఇవ్వకపోవడం వెనుక రాజకీయ ప్రముఖుల హస్తం ఉందని ఆరోపించారు. అరెస్ట్ చేసిన నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శంకరయ్య, మాధవరెడ్డి, కృష్ణ, మధు ప్రశాంత్, చిట్టిబాబు, సోమ్లా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ వ్యూహాలపై 'పవర్ ప్లే' ఆవిష్కరణ

మన్సూరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రాజకీయ వ్యూహాలపై ఎల్బీనగర్‌కు చెందిన రమాకాంత్ రచించిన 'పవర్ ప్లే' పుస్తకాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, టీఎస్ఆర్ఈడీసీ మాజీ చైర్మన్ సతీష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేటీఆర్ తదితరులు



ఆశ్రమానికి నిత్యావసరాలు అందజేసిన బాలకృష్ణ కుటుంబ సభ్యులు

మాతృ దేవోభవ ఆశ్రమానికి నిత్యావసరాలు

సరూర్‌నగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నాదర్‌గుల్‌లో గల మాతృ దేవోభవ అనాథాశ్రమంలో ఉంటున్న అనాథలకు తనవంతు సాయం చేయడానికి బాలాపూర్ చౌరస్తాకు చెందిన సరికొండ బాలకృష్ణాగౌడ్ ముందుకొచ్చారు. మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి ఆశ్రమానికి బియ్యం, కూరగాయలు, పప్పు, చింతపండు, కారంపొడి, వంట నూనె తదితర నిత్యావసరాలను అందజేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు చిగిరింత దయారెడ్డి, బాలకృష్ణ కుటుంబ సభ్యులు మానస, అక్షయ, ప్రశాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు సయ్యద్ జానీకి
వినతిపత్రం అందజేస్తున్న హైదరాబాద్ టాలెంట్ స్కూల్ విద్యార్థులు

వీధి కుక్కల బారి నుంచి రక్షించండి

మన్సూరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వీధికుక్కల బారి నుంచి రక్షించాలని సహారాస్టేట్స్‌కాలనీలోని హైదరాబాద్ టాలెంట్ స్కూల్ విద్యార్థులు కోరారు. మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించి కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు సయ్యద్ జానీ, సభ్యులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాలనీ ప్రధానకార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మేకల ప్రభాకర్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ రోజారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అద్దె భవనంలోకి సుల్తాన్‌పూర్ అంగన్‌వాడీ కేంద్రం

● నెలనెలా అద్దె చెల్లిస్తా : మాజీ సర్పంచ్ జగన్‌రెడ్డి

సరూర్‌నగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని సుల్తాన్‌పూర్‌లో శిథిల భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం స్థానికంగా గల ఓ అద్దె భవనంలోకి తరలించారు. నెలనెలా అద్దె చెల్లిస్తానని వెంకటాపూర్ మాజీ సర్పంచ్ బొర్ర జగన్‌రెడ్డి ముందుకొచ్చారు. పాత భవనానికి పెయింటింగ్ వేయిస్తానని ఆయన ప్రకటించారు. పాత భవనానికి మరమ్మతులు చేయాలని కోరుతూ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి రేణుక బడంగ్‌పేట్ మునిసిపల్ అధికారులకు మంగళవారం వినతిపత్రం అందజేశారు.



గ్రీన్‌పార్క్ కాలనీలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్, కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి



వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న డీసీ వంశీకృష్ణ, కార్పొరేటర్ చింతల అరుణ



మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్



ఎస్‌బీహెచ్ కాలనీలో మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న సైదాబాద్ కార్పొరేటర్ అరుణ రవీందర్ రెడ్డి

పర్యావరణ పరిరక్షణకు..

మట్టి వినాయకులనే పూజిద్దాం

ఎల్‌బీనగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలనే పూజిద్దామని జీహెచ్‌ఎంసీ ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్ అన్నారు. మంగళవారం లింగోజిగూడ డివిజన్ పరిధిలోని గ్రీన్‌పార్కుకాలనీలో కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్ రెడ్డితో కలిసి మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ సర్కిల్ ఉపకమిషనర్ మల్లికార్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట: వాస్విక్ ఫౌండేషన్, రాచకొండ పోలీసుల సంయుక్తాధ్వర్యంలో మంగళవారం ఎల్‌బీనగర్ పీఎస్‌లో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. కొత్తపేట డివిజన్ సీటీఓ కాలనీలో కార్పొరేటర్ పవన్‌కుమార్ మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు.

మన్సూరాబాద్: శ్రీసాయినగర్‌కాలనీలో గల వార్డు కార్యాలయంలో మట్టి వినాయక విగ్రహాలను జీహెచ్‌ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బి.వంశీకృష్ణ, నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణాసురేంద్రనాథ్ మంగళవారం పంపిణీ చేశారు. మన్సూరాబాద్ చౌరస్తా, సహారా స్టేట్స్ కాలనీ, వీరన్నగుట్ట తదితర ప్రాంతాల్లో ప్రజలకు ఉచితంగా మట్టి విగ్రహాలను బీఆర్ఎస్ నాయకులు పంపిణీ చేశారు.



ఐఎస్‌సదన్ లక్ష్మీనగర్‌లో వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్‌రెడ్డి

సంతోష్‌నగర్: ప్రతీ ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి సూచించారు. ఎస్‌బీహెచ్‌కాలనీలో ప్రజలకు విగ్రహాలను మంగళవారం పంపిణీ చేశారు.



హస్తినాపురంలో విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో కార్పొరేటర్ సుజాతనాయక్ తదితరులు



వనస్థలిపురంలో విగ్రహాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్ రెడ్డి

చంపాపేట: హస్తినాపురం డివిజన్ జడ్‌పీ రోడ్డులో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో మట్టి గణపతి ప్రతిమలను కార్పొరేటర్ సుజాత నాయక్ పంపిణీ చేశారు.

హయత్‌నగర్: మునగనూర్ టెలిఫోన్‌కాలనీలో కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ శ్రీచరణ్ ఆధ్వర్యంలో మట్టి వినాయకులను పంపిణీ చేశారు.

వనస్థలిపురం: సచివాలయ కాలనీలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో వినాయక విగ్రహాలను కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి మంగళవారం పంపిణీ చేశారు.

చంపాపేట: కర్మన్‌ఘాట్‌లో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ముదుపు రాజ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు.

మర్రి ఆకుపై మూషికవాహనుడు



మన్సూరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్‌కు చెందిన ప్రముఖ చిత్రకారుడు, కార్టూనిస్టు నాగార్జునపు రాము పండగలు, ప్రత్యేక రోజుల్లో చిత్రకళతో ఆకట్టుకుంటుంటాడు. ఇందులో భాగంగా మంగళవారం మర్రి ఆకుపై మూషిక వాహనుడి చిత్రాన్ని గీశాడు.

మట్టి విగ్రహాలపై అవగాహన



మట్టి గణపతులతో లార్డ్స్ స్కూల్ చిన్నారులు

సరూర్‌నగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మట్టి గణపతి విగ్రహాలపై మంగళవారం పలు ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా బడంగ్‌పేట్‌లోని లార్డ్స్ హైస్కూల్‌లో పర్యావరణంపై అవగాహన కల్పిస్తూ చిన్నారులతో మట్టి ప్రతిమలను తయారు చేయించారు. అనంతరం చిన్నారులు మట్టి ప్రతిమలకు పూజలు నిర్వహించి భజనలు చేశారు.

- బడంగ్‌పేట్‌లోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఎన్‌ఎస్ఎస్ విభాగం, కేరీర్ గైడెన్స్ మహిళా విభాగం సంయుక్తాధ్వర్యంలో మట్టి గణపతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో మట్టి ప్రతిమలను తయారు చేయించారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త కాల్చితే జరిమానా

● మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో చెత్త కాల్చితే జరిమానా తప్పదని పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ కమిషనర్ సింగిరెడ్డి రవీందర్‌రెడ్డి హెచ్చరించారు. 100 రోజుల పట్టణ ప్రణాళికలో భాగంగా మంగళవారం మున్సిపాలిటీ పరిధిలో ప్లాస్టిక్ కవర్లు వాడొద్దని, బహిరంగ ప్రదేశాల్లో చెత్తను కాల్చొద్దని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ 125 మైక్రాన్ల కన్నా తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లు వాడొద్దని ప్రజలకు సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త కాల్చితే రూ. 5 వేల జరిమానా విధిస్తామన్నారు.

మిల్లెట్ మేళా ప్రారంభం

పట్టణ డ్వాక్రా మహిళ సంఘాలు, రీసోర్స్ పర్సన్ పెద్దఅంబర్‌పేట్‌లోని అంబేడ్కర్ భవనంలో ఏర్పాటు చేసిన మిల్లెట్ మేళాను కమిషనర్ రవీందర్‌రెడ్డి ప్రారంభించి స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో మేనేజర్ కిరణ్ కుమార్, డీఈఈ జ్యోతిరెడ్డి, ఆర్ఐ హరికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దశరథ తదితరులు పాల్గొన్నారు.



మిల్లెట్ మేళాలో స్టాల్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ రవీందర్‌రెడ్డి

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

హైదరాబాద్ సిటీ/మన్సూరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కామినేని ఆస్పత్రి జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ ఎం. స్వామి సూచించారు. మంగళవారం ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డెంగీ, చికెన్ గున్యా, ఇన్‌ఫ్లూయెంజా, వైరల్ ఫీవర్లు ప్రస్తుతం వస్తున్నాయని, రెండు, మూడు రోజులైనా జ్వరం తగ్గకపోతే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఇల్లు, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, గోరువెచ్చని నీరు తాగాలని, బయటి ఆహారం తినకపోవడం మంచిదన్నారు. బయటకు వెళ్లినప్పుడు మాస్కు ధరించాలన్నారు. సమావేశంలో డాక్టర్లు హరికిషన్, బొడ్డు శ్రీకృష్ణ రాఘవేంద్ర, ప్రదీప్‌కుమార్ పటేల్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎం. స్వామి,
చిత్రంలో డాక్టర్లు హరికిషన్, శ్రీకృష్ణ రాఘవేంద్ర, ప్రదీప్‌కుమార్ పటేల్

చెరువుల వద్ద రక్షణ చర్యలు చేపట్టాలి

సరూర్‌నగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో చెరువుల వద్ద ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలు చేపట్టాలని మునిసిపల్ కమిషనర్ సరస్వతికి కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి సూచించారు. నాదర్‌గుల్‌లోని సున్నంచెరువులో ఇటీవల ఓ బాలుడు పడి మృతిచెందిన నేపథ్యంలో సదరు చెరువు వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతూ గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానికులు మంగళవారం కేఎల్లార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన కమిషనర్‌కు ఫోన్ చేసి చెరువుల వద్ద ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు.

కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎర్ర జైహింద్‌కుమార్, బంగారు అశోక్, కుమార్‌యాదవ్, పుట్టగల్ల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

● టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి

ఎల్‌బీనగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తామని టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. ఆర్‌కేపురం డివిజన్‌లో పలు కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఆయనను మంగళవారం కలిసి సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులపై కాలనీ సంక్షేమ సంఘాలు దృష్టి సారించాలన్నారు. గణపతి నవరాత్రి ఉత్సవ కమిటీ సభ్యులు అధికారులకు సహకరించాలని సూచించారు. సమావేశంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి, కాంగ్రెస్ ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత, శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవాలయ చైర్మన్ తలాటి రమేష్‌నేత తదితరులు పాల్గొన్నారు.



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ జయమాల, చేపూరి శంకర్

మదర్ థెరెసా జీవితం ఆదర్శనీయం

వనస్థలిపురం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మదర్ థెరెసా జీవితం ప్రతీ ఒక్కరికీ ఆదర్శనీయమని వనస్థలిపురం ఏరియా ఆస్పత్రి ఆర్‌ఎంవో డాక్టర్ జయమాల అన్నారు. మంగళవారం మదర్ థెరీసా 115వ జయంతి సందర్భంగా మదర్ థెరెసా చారిటబుల్ సొసైటీ అధ్యక్షుడు చేపూరి శంకర్ ఆధ్వర్యంలో వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు సీహెచ్.సునీత, సందీప్, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణ సుబ్బారావుకు నివాళి

చంపాపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత కాంగ్రెస్ సేవాదళ్ వ్యవస్థాపకుడు, పద్మభూషణ్ డాక్టర్ నారాయణ సుబ్బారావు హార్డికర్‌కు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ నివాళులర్పించారు. సుబ్బారావు 50వ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం గాంధీభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని చిత్రపటానికి పూలమాలవేశారు. కార్యక్రమంలో సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, సేవాదళ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పెద్ద చెరువు వద్ద పనులను పరిశీలిస్తున్న
సీఐ మహేష్‌గౌడ్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు

మన్సూరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మండపాల వద్ద, నిమజ్జన కొలనుల వద్ద ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా జీహెచ్‌ఎంసీ, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ, పోలీసుల సహకారంతో చర్యలు తీసుకుంటున్నామని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ మహేష్ గౌడ్‌తో కలిసి మంగళవారం మన్సూరాబాద్ పెద్దచెరువు వద్ద పనులను పరిశీలించారు. కార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్ గిరీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శివారులో 'వినాయక' సందడి

● విగ్రహాల కొనుగోలుకు తరలివస్తున్న మండపాల నిర్వాహకులు

● 16 ఫీట్ల విగ్రహం రూ. 1.10 లక్షలు

హయత్‌నగర్/అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నగర శివారు పెద్దఅంబర్‌పేట్ ఓఆర్ఆర్ సమీపంలో వినాయక విగ్రహాల తయారీ కేంద్రాలు ఉండడంతో అక్కడ సందడి వాతావరణం నెలకొంది. రెండు, మూడు రోజులుగా నగరంలో పలు ప్రాంతాలకు చెందినవారు వచ్చి విగ్రహాలు కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. మంగళవారం ఆ ప్రాంతం విగ్రహాల కొనుగోలుదారులతో సందడిగా నెలకొంది. అర ఫీటు మొదలుకొని 16 ఫీట్ల ఎత్తుగల విగ్రహాలను తయారు చేశారు.

గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం సుమారు 10 నుంచి 20 శాతం గణేశ్ విగ్రహాల ధరలు పెరిగినట్లు కొనుగోలుదారులు తెలిపారు. అనుకున్న స్థాయిలో విగ్రహాల అమ్మకం జరగడం లేదని తయారీదారులు అంటున్నారు. ఈ ఏడాది షోలాపూర్ నమూనా విగ్రహాలకు ఎక్కువ డిమాండ్ ఉందని చెప్పారు. 16 ఫీట్ల వినాయక విగ్రహం ధర రూ. 1.10 లక్షలు, 12 ఫీట్ల విగ్రహం రూ. 40 వేలు, 8 ఫీట్ల విగ్రహం రూ. 20 వేలు, 6 ఫీట్ల విగ్రహం రూ. 10 వేలకు, ఫీటు, అరఫీటు విగ్రహాలను రూ. 1,500 నుంచి రూ. 2 వేలకు విక్రయిస్తున్నారు.

బీజేపీ నాయకుడు సామ రంగారెడ్డిపై కేసు

ఉప్పల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల పంచాయితీలో తలదూర్చిన బీజేపీ నాయకుడు సామ రంగారెడ్డిపై ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామంతాపూర్ ప్రగతినగర్‌లో నివసిస్తున్న మెతుకపల్లి రవీందర్‌రెడ్డి కుమారుడు రిత్విక్‌రెడ్డికి, ఎల్‌బీనగర్‌కు చెందిన రొక్కం కృష్ణారెడ్డి కుమార్తె ఆకాంక్షరెడ్డితో వివాహం జరిగింది. కొద్ది రోజులుగా రిత్విక్‌రెడ్డి, ఆకాంక్షరెడ్డి మధ్య విభేదాలు రావడంతో విడిగా ఉంటున్నారు. భార్యాభర్తల వివాదంపై చర్చించేందుకు ఆకాంక్షరెడ్డి తల్లిదండ్రులు, బీజేపీ నాయకుడు సామ రంగారెడ్డి మరికొందరు రామంతాపూర్ ప్రగతినగర్‌లోని రిత్విక్‌రెడ్డి ఇంటికి వెళ్లారు. మాట్లాడుకుంటుండగా వివాదం నెలకొంది. సుమారు 100 మందితో వెళ్లిన ఆకాంక్షరెడ్డి తల్లిదండ్రులు, బంధువులు, సామ రంగారెడ్డి తమపై దాడి చేశారని రిత్విక్‌రెడ్డి తండ్రి రవీందర్‌రెడ్డి ఈనెల 23న ఉప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తమను బెదిరించి రూ.2.5 కోట్లకు చెక్కులపై సంతకాలు చేయించుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకుంటున్న మండపాలు



చంపాపేట ఎస్‌జీఆర్ కాలనీలో యాదగిరిగుట్ట ఆలయ ఆకారంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం



చంపాపేట యాదగిరినగర్ కాలనీలో రాజుల కోట ఆకృతిలో ఏర్పాటు చేసిన మండపం



మారుతీనగర్‌కాలనీలో ఆలయ ఆకారంలో మండపం

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

కొత్తపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని రాచకొండ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్(టీటీఐ) టీటీఐ అధికారులు, ఇన్‌స్పెక్టర్ రాచపుడి సూచించారు. మంగళవారం రాచకొండ పరిధిలోని యాదాద్రి మోటకుండూరు, కూనూరులో, ముత్తిరెడ్డి పాలెం జడ్‌పీహెచ్‌ఎస్‌లలో, కేతపల్లిలో యంపీపీఎస్, భువనగిరి, రాయగిరి, చీమలకుండూరులలో ప్రైవేటు విద్యాసంస్థల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని ఇన్‌స్పెక్టర్ రాచపుడి తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 50 మందికి కుటుంబ సభ్యుల సమక్షంలో ఇన్‌స్పెక్టర్ ఎస్‌పీవో అమరవర్ధన్‌రెడ్డి కౌన్సెలింగ్ ఇచ్చారు.